క్లుప్తంగా

హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు మేనేజర్

నగరి : స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులకు స్టెప్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాజెక్టు మేనేజర్ కళావాణి వివరించారు. వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకూడదన్నారు. అలాగే క్షయ, సుఖవ్యాధుల చికిత్స గురించి సంబంధిత వ్యాధులకు తీసుకోవాల్సిన మందులు, సందేహాలకు టోల్ ఫ్రీ నంబర్ 1097లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మంజుల, అధ్యాపకులు. వెంకటేశులు, లక్ష్మీపతి, ఏఎన్ఎం సుమ, ఔట్ రీచ్ వర్కర్ ఇందుమతి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత మన బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీడీఓ పురుషోత్తం

వెదురుకుప్పం : పల్లెలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ పురుషోత్తం పిలుపునిచ్చారు. మంగళవారం వెదురుకుప్పంలో హరిత రాయబారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీల్లోని ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిత్యం సేకరించాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సఫాయి కర్మచారి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రకళ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు జాతీయ స్థాయిలో గుర్తింపు కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈ మేరకు గుర్తింపు కార్డులు సైతం మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యదర్శులు వెంకటేశు, ఉమాశంకర్, చిన్నబ్బరెడ్డి పాల్గొన్నారు.

హైరోడ్డు విస్తరణలో భవనాల తొలగింపు



విస్తరణ పనులు పర్యవేక్షిస్తున్న ఏసీపీ నాగేంద్ర

చిత్తూరు అర్బన్: నగరంలోని హైరోడ్డు విస్తరణలో భాగంగా మంగళవారం అధికారులు పలు భవనాలను తొలగించారు. హైరోడ్డు శ్రీకృష్ణ ఆలయం పక్కన ఉన్న భవనం తొలగించడానికి దాని యజమానులు సుముఖత వ్యక్తం చేయడంతో అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తన సిబ్బందితో కలిసి కట్టడాలను యంత్రాల సాయంతో నేలమట్టం చేశారు. కట్టమంచి నుంచి కలెక్టరేట్ వరకు హైరోడ్డును విస్తరించడానికి అధికారులు ప్రక్రియ ప్రారంభించగా.. కొందరు పరిహారం కోసం వేచి ఉన్నారు. మరి కొందరు స్వచ్ఛందంగా భవనాలు తొలగించడానికి అంగీకార పత్రాలు ఇస్తున్నారు.

చెలరేగుతున్న చోరులు

రయ్ మని రావడం.. రెప్పపాటులో పడిపోతున్నట్లు నటించడం.. ఆ పై సాయం చేయడానికి వచ్చిన వ్యక్తికి తోడుగా వచ్చినట్టు మరో వ్యక్తి నటించడం.. జేబులో సెల్‌ను చల్లగా కొట్టేస్తున్నారు జోడు దొంగలు. నగరి నియోజకవర్గంలో ఈ రకం చోరీలు ఇటీవల జోరందుకున్నాయి.

పక్కా ప్లాన్... కొట్టేస్తున్నారు!

- రెచ్చిపోతున్న కొత్త తరహా సెల్‌ఫోన్ చోరులు
- 30 సెకన్ల వ్యవధిలో చాకచక్యంగా చోరీ చేసి పరారీ
- సీసీ కెమెరాల ఆధారంగా వెలుగులోకి వచ్చినవైనం





నగరి పట్టణంలో బైక్ పైకిలేపుతున్న గోపాల్ మేస్త్రి నుంచి ఫోన్ చోరీ చేస్తున్న దృశ్యం , (ఇన్‌సెట్) చోరీకి ముందు వచ్చి ఫోల్ వెనుక నిలబడి ఉన్న జోడుదొంగ

నగరి : నియోజకవర్గంలో కొత్త తరహాలో సెల్‌ఫోన్ చోరులు రెచ్చిపోతున్నారు. ఒక ప్రత్యేక పద్ధతిని పాటిస్తూ క్షణాల వ్యవధిలో సెల్‌ఫోన్ చోరీ చేసి పరారవుతున్నారు. సీసీ కెమెరా విజువల్స్ పరిశీలిస్తే ఈ నయా చోరుల గుట్టు తెలిసిపోయింది. నియోజకవర్గంలోని నగరి పట్టణానికి చెందిన గోపాల్ మేస్త్రీగా పనిచేస్తున్నారు. ఆగస్టు 25వ తేదీన ఉదయం 8.23 గంటలకు పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న సందులో జరిగే ఇంటి నిర్మాణ పనులు చూసేందుకు వెళ్లారు. ఆయన వెనుకే వచ్చి ఒక యువకుడు కాస్త ముందుకెళ్లి తిప్పుకుంటూ బైక్ పడిపోతున్నట్లు సాయం చేయాలని అడిగాడు. దీంతో గోపాల్ మేస్త్రి వెంటనే ఆ యువకుడికి సాయం చేయడానికి వెళ్లాడు. అదే సమయంలో మరొక యువకుడు కూడా వచ్చి బైక్ పైనుంచి పడిపోతున్న యువకుడికి గోపాల్‌తో పాటు సాయం అందించాడు. వెంటనే అదే బైక్‌పై వాళ్లిద్దరూ వెళ్లిపోయారు. ఆ తర్వాత గోపాల్ తాను వచ్చిన పనికి వెళుతూ పైపాకెట్‌లో సెల్‌ఫోన్ లేకపోవడం గుర్తించాడు. వెంటనే వారు వెళ్లిన దిశగా పరుగులు తీసినా ఆ యువకులు కనిపించలేదు. ఆ ఇద్దరూ యువకులే సెల్‌ఫోన్ కొట్టేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడే ఉన్న సీసీ కెమెరాలో ఇదంతా స్పష్టంగా రికార్డు అయ్యింది. అదే రోజు ఉదయం 8.35 గంటలకు పుత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టైపిస్టుగా పనిచేస్తున్న సురేంద్ర పట్టణంలోని టీబీ రోడ్డులో వెళుతుండగా ఎదురుగా బైక్‌పై వచ్చిన వ్యక్తి అకస్మాత్తుగా బైక్ నుంచి వాలిపోతూ సాయం చేయాలని అడిగాడు. సురేంద్ర వాలిన బైక్‌ను ఎత్తే ప్రయత్నం చేస్తుండగా దూరంగా నిలబడిన ఒక వ్యక్తి తాను కూడా సాయం చేయడానికి వచ్చినట్లు పరుగులు తీస్తూ అక్కడకు వచ్చాడు. బైక్‌ను లేపి ఆపై అతనితోపాటే బైక్‌లో వెళ్లిపోయాడు. కాస్త దూరం ముందుకు వెళ్లిన సురేంద్ర పాకెట్‌లో ఫోన్‌లేకపోవడంతో జరిగిందని తెలుసుకుని యువకులు వెళ్లిన దిశగా పరుగులు తీశాడు. అంతలో వారు మాయమయ్యారు. అక్కడే ఉన్న సీసీ కెమెరాలో ఇదంతా స్పష్టంగా రికార్డు అయ్యింది. కాగా నగరి, పుత్తూరులో జరిగిన చోరీలకు పాల్పడిన వ్యక్తులు ఒకరే కావడం 12 నిమిషాల వ్యవధిలో 14 కిలోమీటర్ల దూరం ఉన్న రెండు ప్రదేశాల్లో చోరీలకు పాల్పడటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.



పుత్తూరులో బైక్ పైకిలేపుతున్న సురేంద్ర నుంచి ఫోన్ చోరీ చేస్తున్న దొంగ

పక్కా ప్లాన్‌తో చోరీ

చోరీ చేసే జోడు దొంగల్లో ఒకరు బైక్ నడిపితే మరొకరు చేతిలో ఒక ప్లాస్టిక్ కవరు పెట్టుకొని ముందస్తుగా వెళ్లి ఆ ప్రాంతంలో నిల్చుని ఉంటాడు. ఫోన్ మాట్లాడుతూ వచ్చేవారిని గుర్తించి పక్కనే వెళ్లి బైక్ వాలిపోయినట్లు ఒకరు నటిస్తారు. దీంతో ఫోన్ మాట్లాడే వ్యక్తి ఆ ఫోన్‌ను పైపాకెట్‌లో వేసుకుని అతనికి సాయం అందించే ప్రయత్నం చేసే సమయంలో జోడు దొంగల్లో ముందుగా వచ్చి నిల్చుని ఉన్న వ్యక్తి కూడా సాయం చేసేందుకు అక్కడకు వస్తాడు. చేతిలో ఉన్న ప్లాస్టిక్ కవర్ సాయం చేసే వ్యక్తి పాకెట్‌కు తగులుతూ ఉంటుంది. కవరే కదా తగులుతోందని భావించే సమయంలో ఫోన్ కొట్టేసి బైక్‌పై అతివేగంగా వెళ్లిపోతారు. ఈ వ్యవహారమంతా 30 సెకన్లలో జరిగిపోతుంది. ఇతర జిల్లాలో జరుగుతూ వచ్చిన ఈ చోరీలు ఇప్పుడు మన జిల్లాలోను ప్రారంభమైంది.

గిరి బలిజ జీఓ రద్దుకు వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నేతలు

శ్రీరంగరాజపురం : ప్రభుత్వం విడుదల చేసిన గిరిబలిజ జీఓను వెంటనే రద్దు చేయాలని జాతీయ కాపు సంఘ ప్రధాన కార్యదర్శి గోపీరాయల్, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు విజయబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు తహసీల్దార్ లోకనాథపిళ్లైకు వినతిపత్రం అందించారు. గోపీరాయల్ మాట్లాడుతూ దొమ్మరకులస్తులను గిరిబలిజగా గుర్తిస్తూ జీఓ నంబర్ 179 జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణయ్య, రమణరాయల్, భాస్కర్, గోపి, సుబ్బనాయుడు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఉపసంహరించుకోవాలి



కార్వేటినగరం తహసీల్దార్ వినతిపత్రం అందిస్తున్న, బలిజ సంఘం నేతలు

కార్వేటినగరం: దొమ్మర కులస్తులను గిరిబలిజగా బలిజల్లో ఉపకులంగా చేరుస్తూ ప్రభుత్వం ,జారీ చేసిన జీఓ అక్రమమని, వెంటనే ఉపసంహరించుకోవాలని జాతీయ కాపు సంఘం ప్రచార కమిటీ కార్యదర్శి గోపీరాయల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. నేతలు కె.ప్రసాద్, నరసింహులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

మహాకుంభాభిషేకానికి మాజీ మంత్రి రోజాకు ఆహ్వానం



మాజీ మంత్రి రోజాను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నింద్ర: మండల కేంద్రంలోని దళితవాడలో నూతనంగా నిర్మించిన ఓంశక్తి ఆలయ మహాకుంభాభిషేకం కార్యక్రమానికి మాజీ మంత్రి రోజాను ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, ప్రచార కమిటీ మండల కన్వీనర్ శివయ్య, వలంటీరు వింగ్ మండల కన్వీనర్ చార్లెస్, యూత్ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

పుత్తూరు: సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామకృష్ణారావు సూచించారు. మంగళవారం అమరంకండ్రిగలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సాగులో నూతన శాస్త్ర పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. తెగుళ్ల నివారణ మందులు, సేంద్రియ ఎరువుల వినియోగానికి డ్రోన్లను వినియోగించడంతో గణనీయంగా ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. స్థానికంగా లభించే సేంద్రియ వనరులు, పశువుల ఎరువులతో భూములకు పోషణ అందించాలన్నారు. ప్రస్తుతం అడవి పందుల సమస్య ఎక్కువగా ఉందన్నారు. వీటిపై అవగాహన కల్పించారు. వేరుశనగ పంటలో రసం పీల్చే పురుగుల నివారణ పసుపు, నీలి రంగు జిగురు అట్టలు ఎకరాకు 25 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పచ్చ పురుగు, లద్దె పురుగుల నివారణకు లింగాకర్షణ బుట్టలు ఎకరానికి పది చొప్పున వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కోదండయ్య, వీహెచ్ఎలు ప్రియాంక, మునెమ్మ, రైతులు పాల్గొన్నారు.



చెరుకు పంటను పరిశీలిస్తున్న అధికారులు,రైతులు

నింద్ర: సమగ్ర సస్య రక్షణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం చెందిన జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ రామకృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని అగరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగాఆయన మట్లాడుతూ చెరుకు, వరి, వేరుశనగ పంటలో ఆశించే పురుగులకు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఏఓ తులసీరాం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



నేతలతో మాట్లాడుతున్న కృపాలక్ష్మి

పాలసముద్రం : వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటీలు పనిచేయాలని పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలో నూతనంగా ఎన్నికైన అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మండల కన్వీనర్ తులసీయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తదితరులు మర్యాద పూర్వంగా కృపాలక్ష్మిని కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. కృపాలక్ష్మి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలే పార్టీకి పునాదులని. గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టంగా తయారుచేయాలని కోరారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, ఇదే సమయంలో వైఎస్సార్‌సీపీకి ఆదరణ అధికమవుతోందని తెలిపారు. కష్టపడి పనిచేస్తే 2029 ఎన్నికల్లో కూటమిని ఓడించి అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే పార్టీ మండలస్థాయి పదవుల ఎంపిక పూర్తయిందని, త్వరలోనే గ్రామస్థాయి కమిటీలను కూడా నియమించనున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వ అరాచక పాలనను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లా లని సూచించారు. అనంతరం కమిటీల సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల మా జీ కన్వీనర్ సుందరరాజు, యువజన విభాగం అధ్యక్షుడు బి.ఆనంద్, మహిళా విభాగం అధ్యక్షులు రమాదేవి, ఉపాధ్యక్షులు అనురేఖ, ఎస్సీ విభాగం ప్రెసిడెంట్ అయ్యప్ప, సోషల్ మీడియా విభాగం ప్రెసిడెంట్ గోపాల్, రైతు విభాగం అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, నేతలు రవిరెడ్డి, విష్ణు, ప్రకాష్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి భారతి

కార్వేటినగరం : బాల్యవివాహాలతో పలు అనర్థాలు తలెత్తుతాయని, ఈ మేరకు ప్రతి విద్యార్థినికీ అవగాహన అవసరమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి తెలిపారు. మంగళవారం కార్వేటినగరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల్య వివాహం కారణంగా అనారోగ్య సమస్యలు వస్తాయని వెల్లడించారు. మైనారిటీ తీరకుండా తల్లిదండ్రులు పెళ్లి చేయాలని యత్నిస్తే రెవెన్యూ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. హెల్ప్ లైన్ నంబర్ 1098 ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని సూచించారు. ప్రేమ అనేది ఆకర్షణ మాత్రమే అని జీవితం కాదని వివరించారు. ఉన్నతంగా చదువుకుని జీవితంలో స్థిరపడిన తర్వాత, తల్లిదండ్రుల సమ్మతితో వివాహం చేసుకోవాలని తెలిపారు. అనంతరం కార్వేటినగరంలోని చాకలివాని గుంట ఎస్టీ కాలనీలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఓ.రవి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.మూర్తి, తహసీల్దార్ నాగరాజు, సీడీపీఓ శోభారాణి, ఎంపీడీఓ చంద్రమౌళి, వైద్యాధికారి భువనేశ్వరి, ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ బాబు

వెదురుకుప్పం : మండలంలోని రేషన్ డీలర్లతో తహసీల్దార్ బాబు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాత రేషన్ కార్డుల స్థానంలో నూతనంగా స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కొత్త కార్డులు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ప్రతి చౌక దుకాణం వద్ద రెవెన్యూ సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు.

104 వైద్యానికి విశేష స్పందన



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండలంలోని కృష్ణజమ్మపురం పంచాయతీ పావులూరుకండ్రిగలో మంగళవారం నిర్వహించిన 104 వైద్య పరీక్షలకు విశేష స్పందన వచ్చినట్లు వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. వైద్యాధికారి మాట్లాడుతూ దోమలు, ఈగల కారణంగా విష జ్వరాలు ప్రబలుతున్నట్లు వెల్లడించారు. కలుషిత నీరు, ఆహారం తీసుకుంటే అతిసారం బారిన పడాల్సి వస్తుందని హెచ్చరించారు. నీటిని కాచి చల్చార్చి వడబోసి తాగాలని సూచించారు. దగ్గు, జ్వరం ఎక్కువగా ఉంటే వెంటనే ప్రభుత్వాస్పత్రికి రావాలని కోరారు. డీఈఓ శరవణన్, ఎమ్ఎల్‌హెచ్‌పీ నిర్మల పాల్గొన్నారు.

చవితి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- జోరుగా పూజా సామగ్రి విక్రయాలు
- మట్టి వినాయకులనే వినియోగించాలంటున్న అధికారులు



నగరి: విక్రయానికి ఉంచిన మట్టి విగ్రహాలు



నగరి: బస్టాండు ప్రాంగణంలో పూజా సామగ్రి తాత్కాలిక దుకాణాలు

నగరి : పట్టణంలో మంగళవారం చవితి సందడి మొదలైంది. వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు పట్టణ ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పండుగ సరుకుల కొనుగోలుకు వచ్చిన జనంతో బస్టాండ్ ప్రాంగణంలో రద్దీ నెలకొంది. వినాయక చవితికి ప్రజలు వీధికో బొజ్జగణపయ్యను కొలువుదీర్చి పూజలు చేస్తారు. ఇందుకోసం ప్రజలు, చవితి నిర్వాహకులు ఉత్సాహంగా వినాయకుని విగ్రహాలు కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్లు, బైకుల్లో వినాయక విగ్రహాలను తీసుకెళ్లడంలోను, గ్రామాలకు విగ్రహాలను తరలించే కార్యక్రమంలో యువకులు నిమగ్నమయ్యారు. పర్యావరణానికి సురక్షితమైన మట్టివినాయక ప్రతిమలకు డిమాండ్ ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాల తయారీ దారులు మట్టి వినాయక ప్రతిమలను విక్రయాలకు ఉంచారు. మట్టితో సుందరంగా తయారు చేసిన కోల్‌కతా వినాయకుని ప్రతిమలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. వినాయకుని పూజకు అవసరమైన పండ్లు, పువ్వులు, పూజా సామగ్రి, గొడుగుల విక్రయాలు ఊపందుకున్నాయి. వీటి ధరలు నింగినంటుతున్నాయి. అయినా జనం విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు.

విజయపురం : విజయపురం మండలంలో వాడ వాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. బుధవారం వినాయక చవితి పురస్కరించుకుని అన్ని గ్రామాల్లో , వీధుల్లో చలువ పందిళ్లు వేసి, విగ్రహాలు కొలువుదీర్చి, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పాలసముద్రం : వినాయక చవితిని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టారు. ఎక్కడికక్కడ మండపాలు నిర్మించారు. గణేష్ విగ్రహాలను కొలువుదీర్చేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

చవితి పత్రుల ప్రదర్శన

పుత్తూరు: పట్టణంలో మంగళవారం చవితి పూజలో సమర్పించే 21 పత్రుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులు చవితి పూజలో సమర్పించే 21 పత్రుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు కోటేశ్వరరావు, పద్మావతి, సుజన పాల్గొన్నారు.



నగరి: చావడి వద్ద సిద్ధమవుతున్న మండపం



పాలసముద్రం : మండపం ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు



కేజే పురంలో కొలువుదీరనున్న గణపతి విగ్రహం



పుత్తూరు: మట్టి విగ్రహాన్ని పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి



పుత్తూరు: పత్రుల ఔషధ గుణాలను వివరిస్తున్న విద్యార్థులు

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం





హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

కార్వేటినగరం : సాయి బాలాజీ నగర్‌లోని శ్రీషిరిడీ సాయినాథుని ఆలయ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే బాబాకు భూపాలి, కాకడ హారతి,అభిషేకం చేపట్టారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయకర్తలుగా ఆర్.బాలాజీ,దిలీప్‌రాజు, కె.నారాయణరాజు వ్యవహరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలాజీ, ఎంపీపీ లత దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం జరిపించారు. మధ్యాహ్నం బెంగళూరుకు చెందిన వైఎస్.మాధవరాజు సుమారు వెయ్యిమందికి అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు చంద్రారెడ్డి, గౌతంరాజు, చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.